క్లుప్తంగా

రహదారి ఆక్రమణ తొలగించాలి



సత్తెనపల్లి: పట్టణంలోని 31వ వార్డు వావిలాల్ నగర్ కాలనీలో రహదారి ఆక్రమణపై రెవెన్యూ అధికారులు స్పందించారు. కాలనీకి చెందిన గరికపాటి రమణయ్య, తాళ్లూరి శ్యాం ప్రసాద్‌ల ఫిర్యాదు మేరకు మంగళవారం తహసీల్దార్ కె.నగేష్, రెవెన్యూ అధికారులు పరిశీలన చేశారు. రహదారి ఆక్రమణ తక్షణమే తొలగించాలని హెచ్చరించారు. వెంటనే తొలగించకపోతే తాము జోక్యం చేసుకొని తొలగించాల్సి ఉంటుందన్నారు.ఆయనతో పాటు ఆర్ఐ ఆదినారాయణ, తదితరులు ఉన్నారు.

ముగిసిన జగన్నాథస్వామి వార్షిక బ్రహోత్సవాలు



చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీసుభద్రా, బలభద్రా సహిత శ్రీజగన్నాథస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ముగింపు వేడుకల్లో భాగంగా స్వామి వారికి విష్వక్సేనపూజ, నవగ్రహపూజ, లక్ష్మీసంవాదం, పర్యంకసేవ, ద్వాదశ ప్రదక్షిణలు నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

రీ సర్వేను పరిశీలించిన తహసీల్దార్



మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల గ్రామంలో జరుగుతున్న రీ సర్వే ప్రక్రియను తహసీల్దార్ ఎం.భవానిశంకర్ మంగళవారం పరిశీలించారు. గ్రామంలోని ఉప్పువాగు వద్ద సుమారు 30 ఎస్సీ కుటుంబాల వారు 50 సంవత్సరాలుగా భూమిని సాగు చేసుకుంటున్నారు. ఎటువంటి ఆధారాలు లేవని, సాగు హక్కు పత్రాలు మంజూరు చేయాలని తహసీల్దార్‌ను కోరారు. ఆ మేర వారి వివరాలు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ సర్వే సిబ్బందిని ఆదేశించారు. ఎవరెవరు ఎంత మేర భూమిని సాగు చేసుకుంటున్నారో పూర్తి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. మండల సర్వేయర్ ఏడుకొండలు, ఆర్ఐ కపిల్, వీఆర్వో హరిప్రసాద్ తదితరులు ఉన్నారు.

కుష్ఠువ్యాధిపై అవగాహన ర్యాలీ



రాజుపాలెం: లెప్రసీ అంటు వ్యాధి కాదని, ఒకరి నుంచి మరొకరికి వ్యాపించదని ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి కే.వెంకటకృష్ణకుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జాతీయ కుష్ఠు నిర్మూలన కార్యక్రమాన్ని పురస్కరించుకుని మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ కుష్ఠువ్యాధిపై మొదట్లోనే గుర్తించినట్లైతే వెంటనే నివారించుకోవచ్చని నినాదాలు చేస్తూ గ్రామ పురవీధుల్లో నినాదాలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ పేరా మెడికల్ అధికారి పాపారావు, హెల్త్ సూపర్‌వైజర్లు జీవన్‌రావు, ఉదయలక్ష్మీ, ఉషారాణి, గంగాధర్, ఎమ్ఎల్‌హెచ్‌పీలు దేవానాయక్, ప్రియదర్శిని, ఏఎన్ఎంలు భాను ,రాజ్యలక్ష్మీ, నాగమణి, శారద, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమించిన ప్రభుత్వ భూమిని కాపాడాలని వినతి

బెల్లంకొండ: మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో టీడీపీ నేత. అతని అనుచరులు ఆక్రమించిన ప్రభుత్వ భూమిని కాపాడాలని మండల వైఎస్సార్ సీపీ నాయకులు మంగళవారం తహసీల్దార్ బి.నిర్మలకు వినతిపత్రం అందజేశారు. బెల్లంకొండ గ్రామంలో సర్వే నంబర్ 524లో స్త్రీ శక్తి భవనం , డంపింగ్ యార్డుకు కేటాయించిన భూమిని, టీడీపీ నాయకుడు అతని అనుచరులు కబ్జా చేసి, అందులో అక్రమ నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. తాజాగా జరుగుతున్న నిర్మాణాలను తక్షణం నిలిపివేసి, తగు చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో మండల కో ఆప్షన్‌మెంబర్ కావూరి షేక్ దరియా, మండల మైనార్టీ సెల్ నాయకుడు బడాబచ్చా, పాకాలపాటి మౌలాలి, గడ్డిపర్తి బాబూరావు, దూదా మేస్త్రీ, జానీ తదితరులు ఉన్నారు.

చెంచాగాళ్ల విమర్శలకు భయపడేది లేదు

- గత పాలకులతో బేరీజు వేసుకుని ప్రజలకు వాస్తవాలు తెలియజేయండి
- మంత్రి అంబటి రాంబాబు
- పట్టణ సచివాలయాల కన్వీనర్లు, గృహసారథుల సమావేశం



మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు, పాల్గొన్న ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్, పార్టీ నేతలు

సత్తెనపల్లి: చంద్రబాబు, ఆయన చెంచా గాళ్ళ విమర్శలకు తాను భయపడేది లేదని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం పట్టణ గృహ సారథులు, సచివాలయాల కన్వీనర్ల సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ పైన ఈగ వాలినా మొట్ట మొదటిగా స్పందించేది అంబటి రాంబాబు అని, అందుకే తనను రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిపక్ష పార్టీలు లక్ష్యంగా చేసుకుని దురుద్దేశం పూరితంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదలకు మేలు చేస్తుంటే ప్రతిపక్ష టీడీపీ జీర్ణించుకోలేక దుష్ప్రచారం చేస్తోందని, దీనిని తిప్పి కొట్టాలని వైఎస్సార్ సీపీ శ్రేణుల కు పిలుపునిచ్చారు. కుల మతాలు, రాజకీయాలు, అవినీతికి తావు లేకుండా రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగిస్తూ నాయకులు తలెత్తుకుని తిరిగే పరిస్థితిని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కల్పించారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతో పాటు మరెన్నో పథకాలు అమలు చేసి ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందేలా వలంటీర్ల వ్యవస్థ ద్వారా కృషి చేశారన్నారు. ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. గృహ సారథులు, సచివాలయాల కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు, వలంటీర్లు ఒకరి పై మరొకరు పెత్తనం చేయకుండా ఐకమత్యంతో కలిసికట్టుగా పని చేయాలన్నారు. రాష్ట్రంలో ఎలాంటి వివక్ష లేకుండా సంక్షేమ పథకాలు మంజూరు చేయడం జరుగుతుందని, ఇది క్షేత్రస్థాయిలో వివరించాలన్నారు. అర్హులైతే అన్ని పార్టీల వారికి పథకాల ద్వారా లబ్ధి చేకూరుతుందని వివరించారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా– 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అఖండ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సంక్షేమ పాలన అందిస్తున్న జగనన్న మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఇంటింటికీ వెళ్లి ప్రస్తుత, గత ప్రభుత్వ పాలనలో తేడాలను వివరించాలని సూచించారు. నియో జకవర్గంలోనూ మీరు గర్వంగా చెప్పుకునేలా పరిపాలన అందిస్తున్నా మన్నారు.



హాజరైన కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు

కార్యకర్తల కృషి, త్యాగాలతోనే....

గత పాలకుల్లాగా దౌర్జన్యపూరితంగా వ్యవహరించడం లేదని ఇలాంటి వాస్తవాలు తెలుసు కొని ప్రజలకు తెలియచెప్పాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్సీ ,వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ విప్లవాత్మకమైన సంస్కరణల సుపరిపాలనలతో సకల జనులకు మేలు జరుగుతోందని, ప్రభుత్వం అందిస్తున్న ఫలాలను భవిష్యత్ తరాలకు అందించే బాధ్యత గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, క్రియాశీలక కార్యకర్తలదేనన్నారు. కార్యకర్తల కృషి, త్యాగాలతోనే రాజకీయ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. ఈ వ్యవస్థలో క్రియాశీలక కార్యకర్తలే కీలకమన్నారు. మీరు బాధ్యతాయుతంగా పనిచేస్తే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ సుపరిపాలన పునరావృతం అవుతుందన్నారు. ప్రభుత్వ విధానాలను, పార్టీ ఆలోచనలను ప్రజల్లోకి వెళ్లేలా సమష్టి కృషితో పని చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి జగన్ విద్యా, వైద్య, వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. రాష్ట్రం వ్యవసాయంలో దేశంలో నాలుగో స్థానంలో ఉందని వివరించారు. నియోజకవర్గంలో గత పాలకులు దౌర్జన్యపూరితంగా వ్యవహరించారని, అంబటి రాంబాబు ఆధ్వర్యంలో స్నేహ పూర్వక వాతావరణం నెల కొందన్నారు. రాజకీయ వేధింపులు లేకుండా పార దర్శకమైన పాలన అందిస్తున్నారని ఆయన అభినందించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ మాట్లాడుతూ పార్టీ పదవులు పొందిన వారు బాధ్యతాయుతంగా పనిచేయాలని, సంక్షేమ ప్రభుత్వాన్ని కొనసాగించేందుకు ఐక్యంగా కృషి చేయాలని సూచించారు. నరసరావు పేట పార్లమెంటు మహిళా నాయకురాలు డాక్టర్. గీతా హసంతి మాట్లాడుతూ గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల బాధ్యతలను, విధి విధానాలను వివరించారు. మహిళా సాధి కారతకు ఈ ప్రభుత్వం కృషి చేస్తుంద న్నారు. గృహసారథుల, కన్వీనర్ల సమావేశాలకు అత్యధిక మంది మహిళలు రావడం సంతోషదాయకమన్నారు. సమావేశంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, వైస్ చైర్మన్‌లు షేక్ నాగూర్ మీరాన్,రమావత్ కోటేశ్వరరావు నాయక్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నటనా చాతుర్యంతో ప్రేక్షకులను రంజింప చేసిన సినీ నటి జమున

సత్తెనపల్లి: సినీ రంగంలో ఎన్నో ఏళ్ళు తన నటనా చాతుర్యంతో ప్రేక్షకులను సినీ నటి జమున రంజింప చేసిందని పలువురు వక్తలు అన్నారు. పట్టణంలోని నాగార్జుననగర్ లోని వాటర్ ప్లాంట్ వద్ద చింతలపాటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం సినీ నటి జమున సంతాప సభ నిర్వహించారు. ఈ సభలో వక్తలు మాట్లాడుతూ వెండి తెర సత్యభామగా ఆమె అద్భుతంగా రాణించారని, ఆమె మృతి కళా రంగానికి తీరని లోటన్నారు. ఏఐటీయూసి నాయకులు కంబాల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజానాట్య మండలి ద్వారా సినీ రంగానికి ప్రవేశించి అనేక పాత్రలకు అద్భుతంగా రాణించారన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ప్రజలకు అల్పాహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కళాకారులు, 9వ వార్డు కౌన్సిలర్ పెద్దింటి వెంకటేశ్వర్లు (చిట్టి), 10వ వార్డు కౌన్సిలర్ గుజ్జర్లపూడి సతీష్, కొలుకుల జోజి రెడ్డి, బాబురావు, జన విజ్ఞాన వేదిక పట్టణ సహాయ కార్యదర్శి కోండ్రు హనుమంతరావు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పి ఇర్మియ, బాబురావు, తలతల. భాస్కర్ రెడ్డి, శ్రీకాంత్, వాటర్ ప్లాంట్ వలీ, జానీ, కాంపౌండర్ హనుమంతరావు. కొండవీటి శ్రీనివాసరావు, కూరపాటి కోటేశ్వరరావు, బుల్లబ్బాయి, వెంకటేశ్వరరావు.జి.శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.



అల్పాహారం పంపిణీలో కళాకారులు

నేడు గడప గడపకు ప్రభుత్వం

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం పట్టణంలోని 3వ సచివాలయ పరిధిలోని (అచ్చంపేట రోడ్) 29వ వార్డు లో బుధవారం ఉదయం 6 గంటలకు జరుగుతుందని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు హాజరుకావాలని కోరారు. ఆయనతో పాటు మున్సిపల్ వైస్ చైర్మన్లు షేక్ నాగూర్ మీరాన్, రమావత్ కోటేశ్వరరావు నాయక్, కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్‌లు ఉన్నారు.

క్రోసూరులో....

క్రోసూరు సచివాలయం-1 పరిధిలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆధ్వర్యంలో సా యంత్రం బుధవారం గడప గడపకు మన ప్రభు త్వం కార్యక్రమం జరుగుతుందని ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి దర్శి వెంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు. కావున అధికారులు, వలంటీర్లు, సచి వాలయ ఉద్యోగులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తప్పక హాజరు కావాలని కోరారు.

భక్తి శ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ట

పెదకూరపాడు: మండలంలోని 75 త్యాళ్లూరు గ్రామంలో ఈనెల 10వ తేదీ శ్రీఅన్నపూర్ణాంబిక సమేత కాశీవిశ్వేశ్వరస్వామి దేవాలయం, షిరిడి సాయిబాబా దేవాల విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో భాగంగా భక్తి శ్రద్ధలతో మంగళవారం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా కోటప్పకొండ ప్రధాన చార్యులు కొండకావూరి అయ్యప్పగురుకుల, యాజ్ఞిక బ్రహ్మ సీతారామ ప్రసాద్, అర్చక స్వాములు శ్రీపతి బాలకృష్ణాచార్యులు, నుదురుపాటి హనుమంతరావు శర్మ, పడుచూరి శ్రీనివాసాచార్యుల బృందంతో గణపతి పూజ, వేద పారాయణ మండపారాధన నిర్వహించారు. అనంతరం డప్పు వాయిద్యాలతో తాళ్లూరు గ్రామంలో గ్రామ పరిహారణ, వాస్తుబలి, ప్రధానమూర్తులకు విశేషగ్రామోత్సవం, జలాధివాసం, కైలాస మండపరాధన, హోమాలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం గయోపాఖ్యాన యుద్ధ ఘట్టం శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో శ్రీచైతన్య నాటకాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో శ్రీసాయి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు

గుండ్లపల్లిలో వైఎస్సార్ పొలంబడి

నకరికల్లు: పొలంబడి క్షేత్రంలో రైతులు సాగులో మెళకువలు నేర్చుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకులు బి.శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. మండలంలో గుండ్లపల్లి గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ పొలం బడి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంటలో దీర్ఘ కాల అధ్యయనాల గురించి రైతులకు వివరించినట్లు తెలిపారు. రబీ సీజన్‌లో సాగుచేస్తున్న పంటలకు ఈకేవైసీ చేయాలని సూచించారు. రైతులందరితో బృంద విన్యాసంలో భాగంగా జలదళం అనే బృందవిన్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈఓ కె.దేవదాసు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

ఆదర్శమూర్తి రమాబాయి అంబేడ్కర్

క్రోసూరు: దళిత బహుజనుల భవిష్యత్తు కోసం తన బిడ్డలనే త్యాగం చేసిన ఆదర్శమూర్తి రమాబాయి భీమ్‌రావ్ అంబేడ్కర్ అని, ఆమెను ప్రతి ఒక్కరు స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు గార్లపాటి దాసు అన్నారు. మంగళవారం వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ ఆధ్వర్యంలో రమాబాయి భీమ్‌రావ్ అంబేడ్కర్ 126 జయంతి సందర్భంగా స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూజగ్జీవన్‌రాం విగ్రహాల సెంటర్‌లో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ఎంపీపీ పి.కోటయ్య, బీఎస్పీ నాయకులు గనుపల్లి శేఖర్ , దొడ్లేరు ఎంపీటీసీ కంభంపాటి నాగయ్య, చిల్కా భాస్కరరావు, కిన్నెర వెంకటేశ్వర్లు, మేదరరోశయ్య, ఊటుకూరు క్రీస్తుదాసు, నందిగం శ్రీనివాసరావు పాల్గొన్నారు.



రమాబాయి అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ నాయకులు

నేడు శివరాత్రి సమన్వయ కమిటీ మూడవ సమావేశం

అమరావతి: పుణ్యక్షేత్రమైన అమరావతి అమరలింగేశ్వరస్వామి వారి శివరాత్రి మహోత్సవ మొదటి సమన్వయ కమిటీ సమావేశం బుధవారం నిర్వహిస్తున్నట్లు దేవాలయ కార్యనిర్వహణాధికారి సునీల్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పత్తెనపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి రాజకుమారి అధ్యక్షతన బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకు ఆలయప్రాంగణంలో నిర్వహించే సమన్వయ కమిటీ సమావేశానికి అధికారులందరూ తమతమ శాఖాపరమైన నివేదికలతో తప్పక హాజరు కావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా స్థానిక శాసన సభ్యుడు నంబూరు శంకరరావు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛందసేవా సంస్థ ప్రతినిధులు హాజరవుతారని ఆయన తెలిపారు.

శవపంచనామా పూర్తి

కుందురువారిపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని కుందురువారిపాలెం గ్రామ సమీపంలోని పీబీసీ కాల్వలో గుర్తించిన గుర్తుతెలియని మహిళా మృతదేహాన్ని మంగళవారం బయటకు తీసి శవపంచనామా పూర్తి చేశారు. గ్రామ వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.పట్టాభిరామయ్య తెలిపారు. మృతదేహం పై కాఫీ కలరు జాకెట్టు, బులుగు కలరు దుస్తులు ధరించి ఉందని, వయసు 40-45 మధ్య ఉండవచ్చని తెలిపారు. రెండు మోకాళ్ళకు ఆపరేషన్ చేసియుండి రెండు స్టీల్ మోచిప్పలు బిగించబడి ఉందని తెలిపారు. పై అనవాళ్ళు గల ఆడవారు ఎక్కడన్నా తప్పిపోయి ఉంటే పోలీస్‌స్టేషన్ గాని : 9440796233 నంబరులో సంప్రదించాలన్నారు.

వైభవంగా కల్యాణం

నాదెండ్ల: గణపవరం-కావూరు డొంక రోడ్డు లో కొలువైయున్న శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం సువర్చలాసమేత వీరాంజనేయ స్వామి కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ తొలి వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. తొలిరోజు ఆలయ ప్రధాన అర్చకులు పావు లూరి మణికంఠాచార్యులు బృందం ఆ నిర్వ హించారు. బుధవారం వార్షికోత్సవ సందర్భా న్ని పురస్కరించుకుని భారీ అన్నదానం నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్ష కార్యదర్శులు కాట్రు శ్రీనివాసరావు, ఆదిపూడి మల్లికార్జునరావు తెలిపారు. కార్యక్రమాలను కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

హుండీ కానుకల ఆదాయం రూ.5.28లక్షలు

అచ్చంపేట: మండలంలోని ఓర్వకల్లులో స్వయంభుగా వెలసిన గంగాదేవి తిరునాళ్ల మహోత్సవాల్లో అమ్మవారి హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను మంగళవారం లెక్కించగా రూ.5,28,871లు వచ్చినట్లు దేవాదాయ కార్యనిర్వహణాధికారి జి.రామకోటిరెడ్డి తెలిపారు. గత యేడాదికన్నా ఈ యేడాది రూ.1,12,000 ఎక్కువగా వచ్చినట్లు తెలిపారు. లెక్కింపు కార్యక్రమంలో సత్తెనపల్లి దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వి.లీలాదేవి, ఆలయకమిటి చైర్మన్ పూల పెద్ద హనుమయ్య, ఉప చైర్మన్ గంగిరెడ్డి కోటిరెడ్డి, ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఫిర్యాదుపై కేసు నమోదు

క్రోసూరు: అచ్చంపేట మండలం చట్టుబోడుతండాకు చెందిన బాలాజీనాయక్ తమ వద్ద ధాన్యం కొనుగోలు చేసి డబ్బులు చెల్లించకుడా కనబడకుండాపోయాడని పోలీసుస్టేషన్‌లో చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మణికృష్ణ మంగళవారం తెలిపారు. ఫిర్యాదుదారుడు వివరాలు తెలుపుతూ తనతోపాటు మరో 15 మంది రైతుల వద్ద నుంచి 827 వరి బస్తాలును రూ.12,40,100కు కొలుగోలు చేసాడన్నారు. అయితే డబ్బులు ఇవ్వకుండా రైతులను ముద్దాయి మోసం చేసి, కనబడకుండా పోయాడని చేసిన ఫిర్యాదు పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

అమరావతి: రాష్ట్రంలోని ప్రముఖదేవాలయాల్లో ప్రభుత్వం నియమించే పాలకమండలి కమిటీల్లో నాయీ బ్రాహ్మణులకు స్థానం కల్పించడంతో పలు బీసి సంఘాలు, మండల నాయీబ్రాహ్మణ సంఘ ప్రతినిధులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మంగళవారం స్థానిక పంచాయతీరాజ్ అతిథిగృహంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో గుంటూరు జిల్లా బీసి సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు బందరావూరి శ్రీనివాసరావు, అమరావతి మండల నాయీబ్రాహ్మణసేవా సంఘం ప్రతినిధులు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా బంధరావూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలో లాగా నాయీ బ్రాహ్మణుల తోక కత్తిరించకుండా వారి ప్రయోజనాలను గుర్తించి వారిని గుర్తించి మిగిలిన సామాజిక వర్గాలతో సమానంగా దేవాలయ పాలక మండలిలో స్థానం కల్పించడం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వెనుకబడిన కులాలవారిపై ఆయనకు ఉన్న ప్రేమకు నిదర్శనవన్నారు. స్థానిక శాసనసభ్యుడు నంబూరు శంకరరావులకు మండల నాయీ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉంగుటూరు నిబద్ధి,బి రాజకుమార్, పి వెంకటేశ్వర్లు, టి కోటేశ్వరరావవు, శివప్రసాద్,సుబ్బు, చింతపల్లి శ్రీనివాసరావు, నాదెండ్ల శివనాగమల్లేశ్వరరావు, బంధంరావూరి వెంకటేశ్వరరావు హనుమంతు, వరప్రసాద్ సాంబశివరావుతదితరులు పాల్గొన్నారు.



సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మండల నాయీబ్రాహ్మణసేవా సంఘం

సృజన్మాతకతను వెలికితీసేందుకు సైన్స్‌ఎక్స్‌పో

క్రోసూరు: విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీసేందుకు ఎడ్యుటాలెంట్ ఎక్స్‌పో ఎంతగానో దోహదపడుతుందని క్రోసూరు ఎంఈఓ యేసురత్నం అన్నారు. మంగళవారం క్రోసూరులోని దిసెంటాన్స్ ఇంగ్లీషుమీడియం పాఠశాల ఆవరణలో అన్ని తరగతుల విద్యార్థులతో ప్రయోగాత్మక ప్రదర్శనలు నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈఓ పాల్గొని ప్రదర్శనను తిలకించి సంతృప్తి చెందారు. విద్యార్థుల్లో చిన్న తరగతుల నుంచి ఇటువంటి ఎడ్యు టాలెంట్ ఎక్స్‌పో ఏర్పాటు చేస్తుండడంతో పాఠ్యాంశాలు బాగా అర్థం చేసుకోగలుగుతారన్నారు. అదేవిధంగా ప్రతి సబ్జెక్ట్ పై బాగా అవగాహన ఉంటుందన్నారు. నేటి విద్యా రంగంలో పోటీ తత్వంతోనే విద్యార్థులు భవిష్యత్తు తీర్చిదిద్దుకోగలగుతున్నారని అన్నారు. పాఠశాలలన్నీ ప్రతి ఏటా ఇటువంటి ప్రయోగాత్మక ప్రదర్శనలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు డాక్టర్ మహ్మద్ షరీఫ్ మాట్లాడుతూ విద్యార్థులు సులభంగా పాఠశాలు నేర్చుకోవాలంటే ప్రయోగాత్మక పదర్శనలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రిన్సిపల్ మేరీ రజిత మాట్లాడుతూ విద్యార్థుల్లో తెలివితేటలనే ఆణిముత్యాలు ఇటువంటి కార్యక్రమాల ద్వారా సానబట్టి వెలికితీయవచ్చునన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థుల ఎడ్యు టాలెంట్ ఎక్స్‌పోను తిలకిస్తున్న ఎంఈఓ యేసురత్నం

సామాజిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలి

బెల్లంకొండ: విద్యార్థులు బాల్య దశ నుంచే సామాజిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుకోవాలని క్యాపిటల్ ఏరియా కౌన్సిల్ ఆఫ్ సొసైటీ అధ్యక్షుడు సాతులూరి రామాంజనేయులు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్యాపిటల్ ఏరియా కౌన్సిల్ ఆఫ్ సొసైటీ సంస్థ మరియు యాంటీ హ్యూమన్ ట్రాపింగ్ యూనిట్ పల్నాడు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సమాజంలో జరుగుతున్న ఘటనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మానవ అక్రమ రవాణా కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఉద్యోగాల పేరుతో యువతను మోసం చేసే వారి గురించి వివరించారు. చదువు లేకుండా పేదరికంలో ఉన్న వారిని లోన్లు ఇప్పిస్తామని, చదువు చెప్పిస్తామని మహిళలు, బాలికలను మోసం చేసేవారి గురించి వివరించారు. గుడ్ టచ్- బ్యాడ్ టచ్, మిస్సింగ్ కేసులు, మానవ అక్రమ రవాణా నిషేదంపై అవగహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం తిరుపతిరావు, యాంటీ హ్యూమన్ ట్రాపింగ్ పల్నాడు సబ్ ఇన్స్‌పెక్టర్ అల్లూరి రెడ్డి, న్యూ విజన్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు ఏడుకొండలు, దిశ ఫౌండేషన్ చైర్మన్ అనురాధ, ఎలిజబెత్ రాణి పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సంస్థ సభ్యులు

కుష్ఠువ్యాధి నిర్మూలనకు కృషిచేయాలి

క్లస్టర్ వైద్యాధికారి ఉమామహేశ్వరరావు

అచ్చంపేట: కుష్ఠువ్యాధిని నిర్మూలించేందుకు ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు కృషిచేయాలని సత్తెనపల్లి కస్టర్ వైద్యాధికారి ఉమామహేశ్వరరావు తెలిపారు. స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో మంగళవారం ఆయన ఏఎన్ఎంలు, ఆశవర్కర్లకు కుష్ఠువ్యాధిపై అవగాహన కల్పించాలన్నారు. ముందుగా వ్యాధి గ్రస్తులను గుర్తించాలన్నారు. చర్మం స్పర్శలేకపోవడం, చర్మం ఉబ్బడం, చెవులపై, వీపుపై, ఎదపై నొప్పిలేని బుడిపెలు రావడం, కనుబొమ్మల వెంట్రుకలు రాలిపోవడం, కనురెప్పలు మూతబడటం, కాళ్ల, చేతులు తిమ్మిర్లు రావడం, ముక్కుదిబ్బడ, ముక్కుల్లో నుంచి రక్తం కారడం, చల్లని, వేడి వస్తువులను గుర్తించలేకపోవడం, కాలి, చేతి వేళ్లు వంకర్లు తిరగడం వంటి లక్షణాలు ఉన్నవారిని ముందుగా గుర్తించి వారికి తగురీతిలో వైద్యం అందించాలన్నారు. పై లక్షణాలున్నవారు వెంటనే పీహెచ్‌సీ వైద్యులను సంప్రదించాలన్నారు.

సచివాలయ సేవలపై సమీక్ష

ముప్పాళ్ళ: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ సచివాలయంలో అందిస్తున్న సేవలపై మంగళవారం తహసీల్దార్, వీఆర్వోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ ఎం.భవానిశంకర్ మాట్లాడుతూ పెండింగ్ అర్జీలు లేకుండా చూడాలన్నారు. ప్రతి రోజు అందిన అర్జీలన్నీ రిజిష్టర్‌లో నమోదు చేయాలన్నారు. రీ సర్వే ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. రోజు వంద ఎకరాలు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్‌లక్ష్మీప్రసాదు, ఇన్‌చార్జ్ ఆర్ఐ లు కపిల్‌దేవ్, ఆంజనేయులు, ఆయా గ్రామాల వీఆర్వోలు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో పాల్గొన్న తహసీల్దార్ భవానిశంకర్

ఆర్‌బీకేల ద్వారా ఎన్నో సేవలు

ఈపూరు: ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా పలు రకాల సేవలు అందిస్తుందని, వాటిని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి రామినేని రామారావు తెలిపారు. మండలంలోని చిట్టాపురం, ముప్పాళ్ల రైతు భరోసా కేంద్రాలను ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ వ్యవసాయ సహాయకులు రైతు భరోసా కేంద్రంలో నిర్వహించాల్సిన విధులు, రిజిష్టర్లు గురించి తగు సూచనలు తెలియజేశారు. ఆర్‌బీకే చానల్ ద్వారా రైతులకు నేటి పద్ధతులలో సాంకేతిక పరిజ్ఞాన వినియోగం గురించి తెలియజేశారు. కియోస్క్ పనితీరు, ఆన్‌లైన్‌లో ఎరువులు ఎలా విక్రయించాలో వివరించారు. అనంతరం వరి, మొక్కజొన్న పంట పొలాలను సందర్శించి ఆయా పంటల సాగులో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను రైతులకు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు సీహెచ్. తిరుమల, ఆర్. శివగాయత్రి, రైతులు తదితరులు పాల్గొన్నారు.